క్లుప్తంగా

మోకాళ్లపై కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని సోమవారం మున్సిపల్ కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్ కుమార్, పట్టణ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, కోశాధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల వేతనాలను జీఓ నంబర్ 36 ప్రకారం రూ.21,000 - రూ.24,500 ఇవ్వాలన్నారు. ఆప్కాస్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, గతంలో 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, పనిముట్లు సకాలంలో ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌రెడ్డి, వెంకటేష్, బాలాజీ, భాస్కర్, ప్రమీలమ్మ, గుర్రమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, శాంతి, జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుండీగా డివైడర్


వ్యర్థాలతో నిండిపోతున్న డివైడర్

పోరుమామిళ్ల : పట్టణంలో రెండేళ్ల క్రితం ప్రారంభించిన రోడ్డు డివైడర్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. డివైడర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల వారు చెత్తా చెదారం, ప్లాస్టిక్ సంచులు, దుకాణాల్లోని వ్యర్థాలు డివైడర్‌లో వేస్తున్నారు. డివైడర్‌ను డస్ట్‌బిన్‌లా వినియోగిస్తున్నారు. వ్యర్థాలు నిండిపోతే నిప్పంటిస్తున్నారు. ఇందువల్ల డివైడర్ గోడలు దెబ్బతింటున్నాయి. దీనిపై మానవ హక్కుల సంఘం చీఫ్ గంగన్న, కార్యదర్శులు ఫణి రావు, శ్రీనివాస్ మాట్లాడుతూ డివైడర్‌లో వ్యర్థాలు వేయకుండా పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీ పాలకులు చర్య తీసుకోవాలని, వ్యర్థాలకు అగ్గి పెట్టడం వల్ల వచ్చే పొగ రోడ్డులో వ్యాపించి అందరినీ ఇబ్బంది పెడుతోందని, ఈ పద్ధతిని అడ్డుకోవాలన్నారు. దుకాణ దారులకు నోటీసులు ఇచ్చి డివైడర్ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ టౌన్ అధ్యక్షుడు వంకధార నరేంద్రరావు ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కోశాధికారి సీవీ జయలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శ్యాంప్రసాద్ ముఖర్జీ కలలను నిజం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ఆర్టికల్ 370 రద్దు చేశారన్నారు. సమైక్య భారతం కోసం ముఖర్జీ తన ప్రాణాలను త్యజించిన సందర్భంగా ఆయన వర్ధంతిని బలిదాన్ దివస్‌గా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి చెన్నా మోహన్, శ్రీశ్రీ, మహిళా అధ్యక్షురాలు ఎస్.కుమారి, కార్యదర్శి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'శివోహం' సేవలు అభినందనీయం

ప్రొద్దుటూరు : శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవాను మూడేళ్లుగా చేస్తుండటం అభినందనీయమని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడు డాక్టర్ టీడీ వరుణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి సహకారంతో అన్న ప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 800 మంది అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడిగా నియమితులైన డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి


సమావేశం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

పోరుమామిళ్ల: ఖరీఫ్‌కు సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని డీలర్లు, దుకాణదారులకు సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, విత్తనాలు, మందులు ఎమ్మార్పీకే అమ్మాలని, రిజిస్టర్లు, స్టాక్ బోర్డు, బిల్లు పుస్తకాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. స్టాక్ నిల్వల నివేదిక 15 రోజులకు ఒకసారి మండల వ్యవసాయాధికారికి సమర్పించాలన్నారు. లెక్కించడానికి వీలుగా ఎరువుల బస్తాలు క్రమ పద్ధతిలో నిల్వ చేయాలన్నారు. నిబంధనలకు పాటించకపోతే దుకాణదారులపై చర్య తప్పదని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమాతో ఉపాధి కూలీలకు ధీమా

- ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం
- ప్రమాద, సహజ మరణానికి రూ.2 లక్షలు
- జాబ్ కార్డు ఉన్న వారికి వర్తించేలా చర్యలు

బద్వేలు నియోజకవర్గంలో జాబ్ కార్డుల వివరాలు

మండలం	జాబ్ కార్డులు
కాశినాయన	7,813
కలసపాడు	6,970
పోరుమామిళ్ల	11,692
బి.కోడూరు	5,605
బద్వేలు	5,243
గోపవరం	4,677
అట్లూరు	5,184


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కాశినాయన : ఉపాధి హామీ పథకం కూలీలకు ఇప్పటి వరకు జీవిత బీమా సౌకర్యం లేదు. ఈ నేపథ్యంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి జీవిత బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు.. నియోజకవర్గంలోని ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ లేదా మేట్‌లు సంతకం పెట్టి అప్పగిస్తే.. బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం మినహాయించుకుంటారని అధికారులు చెబుతున్నారు. బీమా రెండు రకాలు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన కింద బీమా భరోసాను కల్పించాలని కార్యాచరణ రూపొందించారు. పీఎం సురక్ష యోజన కింద ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లించాలి. ప్రమాదవశాత్తు కూలీ మృతి చెందితే రూ.2 లక్షలు బీమా అందిస్తారు. పీఎం జీవనజ్యోతి యోజన కింద ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లిస్తే సహజ మరణం, ప్రమాదం వల్ల మృతి చెందితే రూ.2 లక్షలు చెల్లిస్తారు.

కూలీల కుటుంబాలకు అండగా..

ప్రస్తుతం ఉపాధి కూలీలలో వయసు మళ్లిన వారు, ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్న వారు ఉన్నారు. వేసవిలో వడదెబ్బ ప్రభావం, ఇతర కారణాలతో ఉపాధి కూలీలు మృతి చెందితే బీమా వర్తిస్తుంది. ఫలితంగా వారి కుటుంబాలకు నగదు సహాయం ఆసరాగా ఉంటుందని ఉపాధి హామీ పథకం అధికారులు చెబుతున్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ప్రీమియం చెల్లించాలని సూచిస్తున్నారు. రెండు రకాల బీమా పొందాలని గ్రామాల్లో సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఉపాధి కూలీ ప్రీమియం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యం


సభలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

పోరుమామిళ్ల : మండల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సీపీఐ పని చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పేర్కొన్నారు. పోరుమామిళ్లలో సోమవారం మండల కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన ఆ పార్టీ మండల 10వ మహాసభ నిర్వహించారు. అంతకు ముందు పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహిస్తూ ఎస్టీయూ భవన్‌కు చేరుకున్నారు. జెండా ఆవిష్కరణ అనంతరం ఎస్టీయూ భవన్‌లో జరిగిన సభలో గాలి చంద్ర మాట్లాడారు. నిరంతరం ప్రజాసమస్యలే ధ్యేయంగా, ఉద్యమాలే ఊపిరిగా సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. పాలకులు మారుతున్నా ప్రజల తలరాతలు మారడం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కరెంటు, నీళ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సూపర్‌సిక్స్ పథకాల పేరుతో మూడు సెంట్ల ఇంటిస్థలం, రెండు ఎకరాల భూమి ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో 100 ఎకరాల ప్రభుత్వ భూమిని అధికారపార్టీ అనుయాయులు అనుభవిస్తున్నారన్నారు. పేదవాడికి, వ్యవసాయ కూలీకి, దళితుడికి భూములు ఇవ్వలేదన్నారు. పేద వారికి అన్ని సౌకర్యాలు దక్కేంత వరకు సీపీఐ అవిశ్రాంత పోరాటం చేస్తుందన్నారు. సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, ఏరియా కార్యదర్శి మస్తాన్, కార్యవర్గ సభ్యులు రమణ, కేశవ, బాలు, సఫా, పేరయ్య, చెన్నయ్య, ఫిరోజ్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన


ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు

బద్వేలు అర్బన్ : గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు కేశవ, ఖలీల్, మహబూబ్‌బాష మాట్లాడుతూ గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్‌కు సంబంధించి విడుదల చేసిన జీవో నెం.5 ద్వారా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, దీంతో జీవోపై పునఃపరిశీలించాలని కోరారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతనే బదిలీల ప్రక్రియ చేపట్టాలని కోరారు. అలాగే రేషనలైజేషన్ తర్వాత మిగులు ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధుల్లో చేరిన తేదీ నుంచి సర్వీసును పరిగణనలోనికి తీసుకొని రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతోపాటు సచివాలయ ఉద్యోగులకు అర్హతను బట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు మహేష్, ముద్దుక్రిష్ణ, శ్రీను, మీన, కౌసర్జహా, శ్వేత, ఆయా సచివాలయాల అడ్మిన్లు, ప్లానింగ్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, రెవెన్యూ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి రస్తాను కాపాడండి


కబ్జాకు గురైన రస్తా స్థలం వద్ద స్థానికులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని బాల సుందరం కాలనీలో గల రస్తాను కబ్జాకు గురికాకుండా కాపాడాలని సోమవారం స్థానికులు ఆందోళన చేపట్టారు. బాలసుందరం కాలనీలోని మడకలవారి పల్లె గ్రామపొలం సర్వే నెంబర్ 967లో గల 2.50 సెంట్ల రస్తా స్థలాన్ని కబ్జా చేసేందుకు యతిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. కాలనీలో గల సుమారు 200 కుటుంబాలు గత 20 ఏళ్లుగా ఇదే రస్తాలో రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రెండేళ్ల క్రితం ఇదే తరహాలో రస్తాను కబ్జా చేసేందుకు వస్తే అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ప్రస్తుతం కూడా గుర్తు తెలియని వ్యక్తులు తమకు పట్టా ఉందని రస్తా స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించడం దారుణమన్నారు. అసలు రస్తా స్థలంలో పట్టా ఎలా ఇచ్చారో అధికారులే నిగ్గు తేల్చాలని కోరారు. ఈ విషయమై రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు


వెలవలిలో రైతులకు జీలుగలు పంపిణీ చేస్తున్న ఏఓ శివరామకృష్ణారెడ్డి

రాజుపాళెం : రైతులు పంటల సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేస్తే భూమి సారవంతమవుతుందని మండల వ్యవసాయ అధికారి ఎస్.శివరామకృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పచ్చిరొట్ట ఎరువులు జీలుగలు, జనుములను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకంతోపాటు ఆధార్ కార్డు తీసుకొచ్చి విత్తనాలను తీసుకెళ్లవచ్చని సూచించారు. ఎకరానికి 10 కేజీల చొప్పున ఐదు ఎకరాల వరకు 50 కేజీలు ఇస్తారని చెప్పారు. జీలుగలు క్వింటాలు పూర్తి ధర రూ.12,300 కాగా 50 శాతం సబ్సిడీ రూ.6,150 పోను రైతులు రూ.రూ.6,150 చెల్లించాలని, జనములు క్వింటాలు ధర రూ.10,900 కాగా సబ్సిడీ రూ.5,450 పోను రైతులు రూ.5,450 చెల్లించాలని సూచించారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తాం


రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గజ్జల వెంకటేశ్వరరెడ్డి

ప్రొద్దుటూరు : రోటరీ క్లబ్ సేవలు విస్తృతం చేస్తామని ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, సెక్రటరీ షేక్ బాబా, ట్రెజరర్ దొంతు బాలాజీ తెలిపారు. రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం స్థానిక రోటరీ కంటి ఆస్పత్రి సభాభవనంలో ఆదివారం రాత్రి ప్రమాణ స్వీకారోత్సం నిర్వహించారు. రోటరీ ఇంటర్నేషనల్ 3160 డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ సాధు గోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ కె.మల్లికార్జున, రోటరీ ట్రస్టు ప్రెసిడెంట్ కోటా శివకుమార్ నూతన రోటరీ క్లబ్ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. 2025-26 సంవత్సరానికి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా గజ్జల వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీగా షేక్ బాబా, ట్రెజరర్‌గా దొంతు బాలాజీ, కార్యవర్గ సభ్యులు ఎర్రగుంట్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమ్ రెడ్డి, తాళ్లమాపురం మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.మనోహర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. నూతన రోటరీక్లబ్ కార్యవర్గానికి రోటరీ క్లబ్ 2024-25 ప్రెసిడెంట్ బాలసూర్యారావు అభినందనలు తెలిపారు. రొటేరియన్స్ డాక్టర్ లక్ష్మీనరసయ్య, డాక్టర్ జి.రాజరామ్మోహన్‌రెడ్డి, వంకధార నరసింహారావు, మురుకూటి సూర్యనారాయణరెడ్డి, బేపారి జాకీర్ అహ్మద్, జి.రామకృష్ణారెడ్డి, ఎండీ అయూబ్ ఖాన్, కొవ్వూరు రవికుమార్‌రెడ్డి, డాక్టర్ అన్నా సత్య ప్రవీణ ఎ.పెంచలయ్య, వెంకటేశ్వర్లు, పి.ఖాదర్‌బాషా, కె.త్రివిక్రమ్ రెడ్డి, ఎస్.మనోహర్ రెడ్డి, జమ్మలమడుగు రోటరీ క్లబ్ సభ్యులు, మిడ్ టౌన్ రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జీఓ నంబర్ 1ను అమలు చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో జీఓ నంబర్ 1ను అమలు చేసి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను పరిష్కరించాలని పీటీఎల్‌యూ రాష్ట్ర కన్వీనర్ గడ్డం సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక ఉప విద్యాశాఖాధికారికి వినతి పత్రం ఇవ్వడానికి వెళితే అక్కడ ఎవ్వరు లేరని.. కనీసం క్లర్క్, జూనియర్ అసిస్టెంట్ కూడా లేరని ఆయన పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు విద్యాసంస్థలు విద్యాసామగ్రిని అమ్ముతున్నా విద్యాశాఖాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రైవేట్ టీచర్లకు సరైన జీతం, పీఎఫ్, గ్యాట్యుటీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత


ఆర్టీఓ మనీషాకు పూల కుండి అందజేస్తున్న ఎంవీఐలు శ్రీనివాసరెడ్డి, హేమకుమార్

ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు భద్రత అందరి సమష్టి బాధ్యత అని, వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆర్టీఓ జి. మనీషా సూచించారు. ప్రొద్దుటూరు ఆర్టీఓగా జి. మనీషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం నుంచి ఆమె బదిలీపై ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇక్కడ ఆర్టీఓగా పని చేస్తున్న మురళీధర్ మచిలీపట్నంకు బదిలీ అయ్యారు. కార్యాలయంలోని ఎంవీఐలు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు నూతన ఆర్టీఓను కలిసి అభినందనలు తెలిపారు.

ఇంటి వద్దే దివ్యాంగులకు రేషన్ ఇవ్వాలి


తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందిస్తున్న షాకీర్ హుస్సేన్

ప్రొద్దుటూరు : ఇంటి వద్దే దివ్యాంగులకు రేషన్ సరుకులు ఇవ్వాలని సోమవారం ప్రొద్దుటూరు తహసీల్దార్ గంగయ్యకు ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు రేషన్ షాప్‌ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు, వయో వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని కోరారు. రేషన్ డీలర్లు సరుకులను దివ్యాంగుల ఇళ్ల వద్దకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, వెంకటలక్ష్మి, జ్యోతి, సుబ్బరాయుడు రాముడు, ఆసిఫ్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న వాసవీ, వనితా క్లబ్ సభ్యులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల వాసవీ క్లబ్, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం ఈదుళ్లపల్లె ఎంపీపీ పాఠశాలలో 62 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. వాసవీక్లబ్ దుబాయ్ గవర్నర్ నూకల మురళీకృష్ణ ఆర్థిక సహాయంతో పుస్తకాల పంపిణీ చేశామని పోరుమామిళ్ల వాసవీక్లబ్ అధ్యక్షులు మోటపోతుల శివకుమార్ తెలిపారు. మురళీకృష్ణ సరస్వతీ పథకం చైర్మన్‌గా పేద విద్యార్థుల ఉన్నతికి సహాయం చేస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ కమిటీ సభ్యులు పవన్‌కుమార్, పద్మనాభయ్య, సుబ్రమణ్యం, సత్యనారాయణ, వనితా క్లబ్ అధ్యక్షులు కృష్ణవేణి, కార్యదర్శి అమ్మణ్ణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవంలో గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగస్త్యేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. సాయంత్రం గంగా, రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేద పండితులు ఘనంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాయదాయశాఖ సహాయ కమిషనర్, ఏఓ వెంకట సుబ్బయ్య, భక్తుల పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు


పుష్పయాగంలో స్వామి, అమ్మవార్లు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్‌ఆఫీసు వెనుకభాగంలో గల శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరు రోజుల పాటు ఘనంగా జరిగి సోమవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి వారికి పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించి చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం వైభవంగా వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండువెంకటరమణ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, పట్టణంలోని ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితుల ఓట్లు తొలగించవద్దు

గోపవరం : మండలంలోని సోమశిల వెనుకజలాల కింద ముంపునకు గురైన సూరేపల్లి, వడ్డిపాళెం దళితవాడలకు సంబంధించి ముంపు బాధితుల ఓట్లను తొలగించవద్దని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. అబవ్ కాంటోర్ కింద 2005, 2006లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2005, 2006లో సూరేపల్లి దళితవాడకు నష్టపరిహారం ఇవ్వడం జరిగిందని, అయితే ముంపునకు గురైన దళితవాడకు సంబంధించి పునరావాసం కల్పించాలని అప్పట్లోనే జీవో నెం.98ను విడుదల చేసినట్లు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆయన మరణానంతరం అప్పటి నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఏ ప్రభుత్వం కూడా దళితవాడ ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమేగాక కనీసం ఇళ్ల పట్టాలు కూడా మంజూరు చేసిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి దళిత వాడ ప్రజలు స్థానికంగా నివాసం ఉన్నారని ప్రతి ఏటా జలాశయంలోకి నీళ్లు వచ్చినా దళితవాడలోకి వెనుకజలాలు రావడం, అధికారులు వచ్చి పరామర్శించడం పరిపాటిగా మారిందని పేర్కొన్నారు. ముంపు బాధితులకు పునరావాసం కల్పిస్తే దళితవాడను ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వచ్చిన అధికారులందరికీ కూడా మొరపెట్టుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అలాగే 2009లో సూరేపల్లె, వడ్డిపాళెం గ్రామాలకు నష్టపరిహారం చెల్లించారని, ఇంకా భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, బోనస్ కూడా ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని, అవి వచ్చేంత వరకు ఇళ్లు ఖాళీ చేయబోమని ఖరాకండిగా అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. అయితే బతుకు తెరువు కోసం ఎక్కడికెక్కడో వెళ్లి కుటుంబాలు పోషించుకుంటున్నారని ఇలాంటి పరిస్థితిల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి చెందిన కొందరు సూరేపల్లి ముంపు బాధితుల ఓట్లు తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓట్లు తొలగింపు కోసం నోటీసలు పంపడం ఎంతమేరకు సబబని ఆయన పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని ఇలాంటి పరిస్థితుల్లో ఏ విధంగా ఓట్లు తొలగిస్తారని ప్రశ్నించారు. పూర్తి స్థాయిలో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తే తాము గ్రామాలను విడిచి వెళ్లేందుకు సిద్ధగా ఉన్నారని తెలిపారు. అప్పటి వరకు బాధిత ఓట్లను తొలగిస్తే వివిధ రాజకీయ పార్టీల ద్వారా ఆందోళనకు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు.

యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి


యువత పోరు కార్యక్రమానికి తరలి వెళ్తున్న నియోజకవర్గ యువజన, విద్యార్థి విభాగం నాయకులు

బద్వేలు అర్బన్ : సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు చాపాటి సాయినారాయణ రెడ్డి పేర్కొన్నారు. యువత పోరు పేరుతో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద సోమవారం చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి నేతృత్వంలో బద్వేలు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున యువత, విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక బయనపల్లె వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. అలాగే అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి దానిని నెరవేర్చకుండా ఉన్న ఉద్యోగాలు ఊడబెరుకుతున్నారని అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తుండే సూపర్‌వైజర్లు, హెల్పర్లు, ఎండీయు ఆపరేటర్లు, ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం నాయకులు హరిక్రిష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వేణు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిన నాయకులు


కడపకు తరలి వెళుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నుంచి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు, మద్దతుదారులు యువత పోరులో భాగంగా కడప కలెక్టరేట్‌కు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. వాహనాలకు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బయిలు వేకపోవడంతో విద్యార్థులు చదువులకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.సందీప్, జిల్లా కార్యదర్శి పేరం సుమన్ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలాజీ నివాస్, మండల అధ్యక్షుడు యోగానంద రెడ్డి, నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు బాషా, ఉపాధ్యక్షుడు చంటి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దావూద్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెలవలి శేఖర్, మార్తల ఓబుళరెడ్డి, బండి సనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తాం

మైదుకూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తామని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి సానా శివనాగిరెడ్డి తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతులను చేయాలని సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తమకు దిశ నిర్దేశం చేసినట్టు శివనాగిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా ప్రజలకు చేసిన మేలును, సేవలను వివరిస్తూ, అదే సమయంలో కూటమి ప్రభుత్వం అనుసరించే దుర్మార్గపు చర్యలను వివరించాలని సూచించినట్టు తెలిపారు.